


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మొదటి దొంగతనం..

**ఆ రోజుల్లో** అన్నీ చాలా చవక. అమ్మ పన్నెండు రూపాయిలు పెట్టి నాకు గౌను కొనేది. తనకి ముప్పై రూపాయిలకి రెండు చీరలు అని కొనుక్కొచ్చిన  కమలాపండు రంగు, నేరేడు పండు రంగు చీరలు నాకింకా గుర్తే. మొగలి పూల పొత్తుల పరిమళం కానీ, చందనం పరిమళం కానీ వస్తూ వుండేవి అమ్మ చీరల మడతలు.

పనస చెక్కతో చేయించి, అద్దాల తలుపు పెట్టిన అల్మారాలో, బొత్తులుగా పేర్చి పెట్టిన చీరలన్నీ నేనే పెద్దయి కట్టుకుంటాను అనుకునేదాన్ని. మామయ్య ఢిల్లీ నుండి కాఫీ పొడి కలర్ మీద చిన్న చిన్న పూలున్న సిల్క్ చీర తెస్తే, అమ్మ కునేగా సెంట్ స్ప్రే చేసి దాచుకోడం నాకింకా గుర్తుంది.

నెలకొసారి నేప్తలీన్ బాల్స్ వేసి పెట్టేది. స్వెట్టర్లు ఓ అరలో, మా దాపుడు బట్టలు అల్మారాలో, రోజూ కట్టుకునేవీ, స్కూల్ డ్రెస్సులు, అద్దాలు లేని కింద అరల్లో.

అమ్మ చీరల వాసన ఎంత బావుండేవో. ఓనాడు బొమ్మల పెళ్ళి చేద్దాం అని  నేనూ, బుజ్జీ, వినోలియా, మంజూ, అందరం అనుకున్నాం. సందానీగాడు "నేను పెళ్ళి చేపించే బాపనాయిన వున్నయ్ అని మొహానికి సున్నం రాసుకుని "హు.. హూ... మాగల్యం.. తంతే మా.కీ.. "అని  ఏవో మంత్రాలు చదవడం మొదలు పెట్టాడు.

"ఆగరా.. ముందు పెళ్ళికొడుక్కీ, పెళ్ళికూతురికీ బట్టలు రెడీ చెయ్యాలి. కొబ్బరి ఆకులతో చక్కగా బొమ్మలు చేద్దాం అంది చిట్టి.

వీధి అరుగు మీద మిషిన్ పెట్టుకుని, కుట్టుకునే శ్రీశైలం దగ్గరకి వెళ్ళి, కత్తిరించి పోసిన బట్టల్లో మంచి రంగున్న కణుపులు తీసుకున్నాం. కొబ్బరాకులతో శాంసన్‌గాడు బొమ్మలు బాగా చేసేవాడు .వాడితో చేయించడానికి వెళ్ళింది చిట్టి.

"మనకి పప్పూ, బెల్లం కావాలి. నీకీ అమ్మమ్మకీ ఆఠాణా అడిగి తీసుకొస్తయ్?" అన్నాడు సందానీ.

అమ్మమ్మని అడగాలంటే నాకు భయం. రాత్రంతా ఆలోచించాను. మర్నాడు అమ్మ ఆఫీస్ నుంచొచ్చి హాండ్ బ్యాగ్ గోడకి తగిలించి, మొహంకడుక్కోడానికి వెళ్ళింది. అమ్మ బ్యాగ్‌లోంచి ఓ అర్ధరూపాయి తీస్తేనేం? బాగా సంపాదించినప్పుడు వెనక్కిచ్చేద్దాం అనుకున్నాను.

అద్దంలో ఇంకోత్తి వచ్చింది. అన్ని సినిమాల్లో లాగే నీతులు చెప్పడానికి. "ఎలా సంపాదిస్తావు?" అంది.

"మిషన్ కుట్టి.. రిక్షాతొక్కి" అనబోయి ఆగిపోయాను.

"పెద్దయ్యాక టీచరో లేదా డ్రైవరో అవుతానులే" అన్నాఉ.

"టీచర్లు అంటే నీకు పడదు. డ్రైవర్ ఎలా అవుతావు? నీకు సైకిల్ తొక్కడమే రాలేదు. ఎప్పుడూ నీ అంతట నువ్వు ఎక్కలేవు. సందానీగాడి సాయం లేకుండా దిగలేవు అంది అంతరాత్మ.

"సందానీగాడు పెద్దయ్యాక కూడా నాతో వుంటాడులే, నేను ఏ బండి నడిపినా" అన్నాను.

అసలు అమ్మ ఆఫీసులో బండెడు కాయితాలు రాయడం కన్నా, ఎదురింట్లో సత్తెయ్య డ్రైవర్, పెద్ద బస్సు నడుపుతూ తీసుకొచ్చి, అప్పుడప్పుడూ ఇంటి ముందు పెట్టడం చాలా గొప్పగా వుండేది.

వాళ్ళ అమ్మాయి సరళ, "బుట్టల నిండా పండ్లూ, మావిడి తాండ్రా, ముంజెలూ తెస్తాడు మా నాన్న. బస్సు ఆపితే జనం బాగా కొంటారుగా, అందుకని ఊరికినే ఇస్తారు అమ్మేవాళ్ళు" అని గొప్పగా చెప్పేది.

పెద్దయ్యాక నేను డ్రైవర్ అవ్వాలని, అప్పుడే అనుకున్నాను. అందుకే చదువు అంటే ఇంట్రెస్టు వుండేది కాదు.

ఇలా అంతరాత్మ, అద్దంలో పెద్ద బొట్టూ, చీరా, తలనిండా పూలూ, చేతినిండా గాజులూ వేసుకునొచ్చి ఏదేదో చెప్తుంటే, "ష్...ష్.." అని వినిపించింది.

తల తిప్పి చూస్తే కిటికీలో సందానీ  గాడు. "పైసలు...పైసలు" అని రహస్య గొంతుతో సైగలు చేసాడు. వీడో ఏ.కే సైగల్‌గాడు అని విసుక్కుని, "ష్" అని, లేచి బ్యాగ్ తగిలించి వుండగానే, జిప్ తీసి లోపల చెయ్యి పెట్టాను. అది ఒరిగి చిల్లరంతా కింద ఘల్లున పడింది.

ఒంగి పెద్ద పెద్ద రూపాయి బిళ్ళలూ, అర్ధరూపాయ్ బ్యాగ్‌లో వేస్తూ, ఓ అర్ధరూపాయి నా గౌన్ జేబులో వేసుకుందామా వద్దా? అనుకుంటూ వుండగా, "రోణు. చిట్టీ" అంటూ అమ్మ ముద్దుగా పిలుస్తూ వచ్చింది. అర్ధరూపాయి తప్ప గబుక్కున డబ్బులన్నీ వేసేసాను బ్యాగ్‌లో.

"చూడు నీకోసం ఏం తెచ్చానో?" అంటూ అమ్మ వచ్చి కాల్చిన మొక్క జొన్న పొత్తు ఇచ్చింది.

నేను దొంగలా తలదించుకుని, మొక్కజొన్న పొత్తు అందుకుని పరిగెత్తుకెళ్ళిపోయా. నా దొంగతనానికి సందనీగాడొక్కడే ప్రత్యక్ష సాక్షి. నేను జీవితంలో చేసిన మొదటి దొంగతనం అదే.  తేనమనసులు అనుకుంట ఆ సినిమాలో

చూసాను. పిల్ల పెళ్ళి కోసం తండ్రి రెండువేల రూపాయిలు దొంగతనం చెయ్యడం. నా గుండెలు అదుర్తున్నాయి. చెమట కారిపోతోంది. అమ్మ బ్యాగ్ తీసుకుని, డబ్బులు లెక్కపెట్టి అర్ధరూపాయి లేదని చూసి నాకోసం వెతుక్కుంటూ వస్తుందేమో? నిన్ను జన్మలో నమ్మలేను. ఇంత పెద్ద దొంగతనం చేస్తావా? అంటుందేమో? నాగరత్నం పిన్ని రాంబాబుని పెట్టినట్లు హాస్టల్లో పెట్టేస్తుందేమో? పేలు పట్టి తలనిండా కురుపులు వచ్చి, రాంబాబుకి చేయించినట్లు నాకూ గుండు చేయించేస్తారేమో? అసలు అమ్మమ్మ నన్ను ఇంట్లోకి రానివ్వకుండా పోలీస్ రిపోర్ట్ ఇస్తుందేమో? నేను ఇవన్నీ ఆలోచించి భయంతో గడ్డ కట్టుకుపోతుండగా, సందానీగాడు నా చేతిలోంచి మొక్కజొన్న పొత్తు తీసుకుని వలుచుకుని తినడం, నేను గమనించలేదు.

"ఒరేయ్..నేను అమ్మ బ్యాగ్‌లోంచి అర్ధరూపాయి దొంగతనం చేసారా! అనగానే వాడు "ఏదీ నాకూ సూపియ్" అని నా జేబులోంచి లాక్కుని, "రేపు అందరికీ పుట్నాలపప్పూ, బెల్లం కొని పంచుదాం" అన్నాడు. పిల్ల పెళ్ళి గ్రాండ్‌గా చేయిస్తున్న భావనతో, గర్వంగా కనిపించే తండ్రిలా.

"అమ్మకి తెలిస్తే?" నేను ఇంకా భయంలో వున్నాను.

"పద.. మరియం ఆంటీ ఇంట్లో అందరూ బట్టలు కుడ్తున్నారు పెళ్ళి కూతురికీ, పెళ్ళి కొడుక్కి" అని నా చెయ్యి పట్టి లాక్కెళ్ళాడు. నేను వాడి వెంట పరిగెడ్తున్నదాన్ని కాస్తా, వాళ్ళ అరుగుమీద చూసి కొయ్యబారిపోయాను.

పోలీసు అరుగు మీద కూర్చుని ఏదో చెప్తున్నాడు. ఆంటీ బుగ్గన వేలేసుకుని వింటోంది.

అమ్మ అప్పుడే పోలీస్‌కి కబురు చేసిందా? ఇంత చిన్న దొంగతనానికే పోలీసులకి పట్టిస్తుందా? నేను చూసిన సినిమాలో దొంగతనం చేసాక జైల్లో పెట్టి రాళ్ళు కొట్టిస్తారు. నేను రాళ్ళు కొట్టగలనా? నా చేతులవైపు చూసుకున్నాను. నేను సందానీగాడిని వీపు మీద కొడితేనే నా చేతులుకాయలు కాస్తాయి. రాళ్ళెలా కొట్టగలను? ఏడుపొచ్చేస్తోంది.

"పద...పద" అంటున్నాడు సందానీ.

"పోలీసులు" అన్నాను.

"నీకీ ఇంటి నుండి ఆంటీ ఇంటికి వచ్చేలోపట నీకీ అమ్మ పోలీసు రిపోర్ట్ ఇస్తదయా?" వాడు నోటికి చెయ్యి అడ్డు పెట్టుకుని నవ్వడం మొదలు పెట్టాడు.

"ఔను కదా" అని నేను ధైర్యంగా వెళ్ళాను.

వాళ్ళేదో చీటీలూ, పదివేల రూపాయిలూ అని మాట్లాడేసుకుంటున్నారు.

పోలీస్ "ఇస్మాయిల్" అన్నాడు.

సందానీగాడు నిలబడి నవ్వాడు.

"ఇస్మాయిల్ ఆజా ఇదర్" అన్నాడు.

సందానీ హీ..హీ అని ముందు పళ్ళు పోయి, తొఁరతో నవ్వుతున్నాడు.

"అరె క్యోం హస్ రే..రే? ఇస్మాయిల్" అన్నాడు పోలీస్.

"ఇస్మాయిల్ అంటున్నవ్ కదా! ఇస్మయిల్ చేస్తున్నయ్" అన్నాడు సందానీ చిరాగ్గా.

"అరె మేరా బాప్. ఇస్మయిల్ అంగ్రేజీ మె నై. తేరే నామ్ బులారే" అన్నాడు పోలీస్.

"నాకీ నామ్ సందానీ. ఇస్మయిల్ నహీ హై " అన్నాడు వాడు.

ఏ రఫీ కా బేటా హైనా?" అన్నాడు పోలీస్.

"నై నై" అంది మరియం ఆంటీ.

పోలీస లేస్తూ "చోర్ జాదా హై.. జాగ్రత్త" అన్నాడు.

'చోర్ ' అన్న మాటకి నేను మళ్ళీ బిగుసుకుపోయాను.

మరునాడు పెళ్ళి చేసేసాం. బొమ్మలకి చెమ్కీ చీరలు కట్టి, 'పీపీపీ" అని కొబ్బరాకుల బూరలూది. సందానీగాడి మంత్రాలు వినలేక చచ్చాం.

"సుక్లాం...డాంబరం..గరం..బజ్జీ" అంటూ ముక్కుతో చదివేసాడు. పెళ్ళిచేసేసాం. పప్పులుండలూ, కొత్త బెల్లంతో తినేసాం. అందరం అమ్మల చీరలు తెచ్చి కట్టేసుకుని, తలమీదనుండి కొంగు వేసుకుని, పెళ్ళికూతురిని బొమ్మ కారులో అత్తారింటికి పంపుతూ, గుండెలు బాదుకుని ఏడ్చాం.

"ఓరినీ.. బొమ్మల పెళ్ళిళ్ళు చేసే ఇంతింత ఏడుస్తున్నారు. రేపు మీకే పెళ్ళిళ్ళు అయితేనో?" అంది వక్కాకు తింటూ శ్యామలమ్మ.

సందానీ తల్లి కూడా నవ్వుతూ చూస్తోంది.

ఇంతలో అమ్మమ్మ వచ్చి "పద! ఇంటికి " అని నా రెక్కపట్టుకు లాక్కొచ్చింది.

"అయిపోయింది. నా దొంగతనం బయటపడిపోయింది. ఇంక అమ్మమ్మ రాంబాబు వుండే దిక్కుమాలిన హాస్టల్‌కి పంపించేస్తుంది. తర్వాత పేలు, పుండ్లూ, గుండు అని బావురుమని ఏడుస్తూ ఇంటికి వెళ్ళాను.

అమ్మ సీరియస్‌గా వుంది.

నేను బావురుమని ఏడుస్తూ "ఇంకెప్పుడూ చెయ్యను. నన్ను పంపకండి" అని అమ్మని చుట్టుకున్నాను.

"ఏం చెయ్యవూ?" అమ్మ అడిగింది.

అమ్మమ్మ "బోలెడు చేస్తుంది రాచకార్యాలు నీ కూతురు" అని ఒక కాయితం తీసుకొచ్చింది.

"అర్ధరూపాయి నీ బ్యాగ్‌లోంచి దొంగతనం చేసాను. పెద్దయ్యాక సంపాదించి ఇచ్చేస్తాను. నన్ను పోలీసులకి పట్టివ్వకు అమ్మా. ఈ అమ్మమ్మ నన్ను రాంబాబు హాస్టల్‌కి పంపించేస్తే, సందానీ వాళ్ళమ్మతో బోలెడు కబుర్లు చెప్పుకోవచ్చనీ, సీతత్తయ్యతో మార్నింగ్ షోకి వెళ్ళొచ్చనీ, నన్ను హాస్టల్‌కి పంపించెయ్యమంటోంది అని" అమ్మ కుచ్చిళ్ళు పట్టుకుని ఏడ్చాను.

అమ్మ నన్ను పట్టి, నా మొహంలోకి చూస్తూ "అర్ధరూపాయి తీసావా? అదెప్పుడూ?" అంది ఆశ్చర్యంగా.

"తెలీలేదా? మరి అమ్మమ్మ నన్ను ఎందుకు రెక్కపట్టుకుని ఈడ్చుకొచ్చిందీ?" అన్నాను.

"అదా? స్కూల్లో మీ క్రీస్తుమణి టీచర్ నువ్వు రాసిన వ్యాసం చూపించిందట. పెద్దయ్యాక బస్సు డ్రైవర్ అవుతాను. ఉత్తినే అందరూ బుట్టల్తో పండ్లు ఇస్తారు. ఈ క్రీస్తుమణి టీచర్ని మాత్రం ఎన్నడు బస్సు ఎక్కించుకోను . బస్సులోనే సినిమాకీ, సర్కసుకీ, అమ్మని బజారుకీ తీసుకెళ్తాను. బస్సు మాత్రం సైకిల్ స్టాండ్‌లో వుంచనివ్వరేమో" అని ఏదేదో రాసావుటగా! బస్సు డ్రైవర్ అవుతావా?" అని అమ్మ పడీపడీ నవ్వుతోంది.

"ఈ అర్ధరూపాయి దొంగతనం మాటేవిటీ?" అంది అమ్మమ్మ.

అమ్మ పట్టించుకోలేదు. నన్ను ఎత్తి ముద్దు పెట్టుకుంటూ "బస్సు నడిపేద్దామనే? పెద్దయాక. వద్దులే అమ్మా, కారుకొని నన్ను సినిమాకి, బజారుకీ అందులో తీసుకెళ్ళు" అని "సత్తెయ్యలా డ్రైవర్ అవుతావూ?" అని ఇంకా ఇంకా నా బుగ్గలు పిండి నవ్వుతూనే వుంది. నా దొంగతనం గురించి పట్టించుకోలేదు పిచ్చి అమ్మ.

అమ్మని కార్లో ఇప్పుడు షూటింగులకి, బజార్లకీ తిప్పుతున్నప్పుడు నా చిన్నప్పుడు తను అన్నమాటలు గుర్తుచేసుకుని నవ్వుకుంటుంది.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4